క్లుప్తంగా

13న బాలాజీ స్వామి కల్యాణోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత బాలాజీ స్వామి వారి కల్యాణోత్సవం ఈనెల 13న నిర్వహించనున్నట్లు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు. బాలాజీ స్వామి ఆలయ 15 వార్షికోత్సవం సందర్భంగా వలు కార్యక్రమాలను ఆరోజు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

రహదారి పనులకు శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ పార్వతి, ఎంపీటీసీ నబ్బో తదితరులు

ముంచంగిపుట్టు: మండలంలోని బరడ పంచాయతీ సగ్గులు, కొదంజోలా, బిమిడీ గ్రామాల రహదారి పనులను సర్పంచ్ సీసా పార్వతి, ఎంపీటీసీ సభ్యులు కోడా నబ్బోలు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టి శరవేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. గ్రామ పెద్దలు లైకోన్, శివకృష్ణ, బుద్దా, బిస్నాట్, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలపై అవగాహన అవసరం


విద్యార్థులతో ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయి, అధ్యాపకులు


పాడేరు రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబ్బాయి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు రాజకీయ మరింత పరిజ్ఞానం కలిగేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. రాజకీయాలపై అవగాహన అవసరమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో చురుకైన పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు రాష్ట్రపతి, స్పీకర్, క్యాబినేట్ మంత్రులు, ఎమ్మెల్యేలుగా పాత్ర పోషించారు. అధ్యాపకులు సుమిత్ర,జగదీస్‌బాబు,రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి ఔదార్యం


బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

గంగవరం: మండలంలోని మొల్లేరు గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామకుర్తి శ్రీను కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే , రంపచోడవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నాగులపల్లి ధనలక్ష్మి మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందచేశారు. నియోజకవర్గంలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. మండల కన్వీనర్ అప్పలరాజు, వైస్ ఎంపీపీ రామతులసి, సర్పంచ్‌లు లక్ష్మి, మరిడమ్మ, మాజీ సర్పంచ్ పండమ్మ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, నాయకులు కొటికలపూడి కొండలరావు, తలారి పాపారావు , శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు ఆర్థిక సాయమందించాలి


రాంబాబు

రంపచోడవరం: నాయి బ్రాహ్మణులకు ప్రభుత్వం ఇచ్చే ఉపాధి యూనిట్లు కాకుండా నేరుగా లబ్ధిదారుల అకౌంట్‌లో డబ్బులు జమ చేయాలని మండల నాయీబ్రాహ్మణ సంఘం నాయకుడు రాంబాబు కోరారు. గతంలో 2014-19 మధ్య అప్పటి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా నాయీ బ్రాహ్మణులకు చేతివృత్తుల పరికరాలు ఇస్తామని ప్రతి ఒక్క సభ్యుడి నుంచి రూ.3వేలు వసూలు చేసినట్టు తెలిపారు. బీసీ కార్పొరేషన్ డీడీ ద్వారా తీసుకున్నారు. ఎవరికీ లబ్ధి చేకూరలేదన్నారు. నాయీ బ్రాహ్మణులందరికీ ప్రభుత్వం ఆర్థికసాయమందించాలన్నారు.


పనులు పూర్తయిన గిన్నెలకోట వంతెన

గత సర్కారు సాయం.. వంతెనలకు మోక్షం

- గిన్నెలకోట వంతెన నిర్మాణం పూర్తి
- జామిగుడ గెడ్డపై వంతెన పనులు ప్రారంభం
- దశాబ్దాల కల నెరవేరిన ఆనందంలో గిరిజనం


గిన్నెలకోటలో వంతెన లేక తాడు సాయంతో గెడ్డ దాటుతున్న గ్రామ సచివాలయ సిబ్బంది(ఫైల్)

పెదబయలు: మన్యంలో రహదారులు, వంతెనలు లేక గిరిజనులు ఏళ్ల తరబడి నానా అవస్థలు పడ్డారు. వరదల్లో ప్రమాదకర గెడ్డలు దాటుతూ అమాయక గిరిజనులు మృత్యువాత పడిన సంఘటనలున్నాయి. దశాబ్దాలుగా ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మన్య ప్రాంతం అభివృద్ధి పథంలో పరుగులు తీసింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అల్లూరి జిల్లాలో ప్రతి ప్రాంతం అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించారు. దశాబ్దాల నాటి గిరిజనుల కల సాకారమైంది. మండలం గిన్నెలకోట గ్రామ సమీపంలో గెడ్డపై వంతెనకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. రెండేళ్లలో అధిక వర్షపాతం వల్ల వంతెన పనులకు జాప్యం జరిగింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 90 శాతం పనులు పూర్తి కాగా, ఎన్నికల కోడ్ వల్ల కొంతమేర నిలిచిపోయాయి. అనంతరం రెండు వారాల క్రితం వంతెన పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం వంతెనపై వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. ఈ వంతెన నిర్మాణంతో గిన్నెలకోట పంచాయతీ 16 గ్రామాలకు రోడ్డు సదుపాయం కలగడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. వర్షాకాలం వస్తే భయంలో గడిపేవారమని, అత్యవసర సమయాల్లో గెడ్డలు దాటి వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లడం సాహసోపేతంగా ఉండేదని, వైద్య సిబ్బంది గ్రామాలకు రావడం కష్టంగా ఉండేదని గుర్తు చేశారు. గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పునాది పడి నేడు వంతెన పని పూర్తవడంతో పంచాయతీ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తీరిన కష్టాలు



అత్యంత మారుమూలలో గిన్నెలకోట, జామిగుడ పంచాయతీలున్నాయి. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో మా ప్రాంతాలకు స్వాతంత్ర్యం వచ్చినట్టు భావించాం. కొన్ని దశాబ్దాలుగా మా ప్రాంతానికి రహదారి, తాగునీరు, వంతెనలు, విద్యుత్ వంటి సదుపాయాలు లేవు. వర్షాకాలం వస్తే బాహ్య ప్రపంచానికి సంబంధాలు ఉండేవి కావు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మా ప్రాంతంలో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గిన్నెలకోట, జామిగుడ ప్రాంతల్లో వంతెనలు మంజూరు చేయడం ఆనందం ఉంది. గిన్నెలకోట వంతెన పనులు పూర్తవడంతో రవాణా కష్టాలు తీరాయి.

– తెరవాద వెంకటరావు, పెదబయలు మండలం

రూ. 2 కోట్లతో వంతెన పనులు ప్రారంభం

మండలంలోని మారుమూల జామిగుడ పంచాయతీ కేంద్రం గ్రామ సమీపంలోని వంతెన నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులతో పనులు ప్రారంభమయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జామిగుడ వంతెన పనులకు అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, మాజీ ఎంపీ మాధవి, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర శంకుస్థాపన చేశారు. 2022లో పనులు ప్రారంభించిన వెంటనే జామిగుడ గ్రామస్తుల స్థల వివాదం వల్ల జాప్యం జరిగింది. ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం వంతెన పనుల కోసం ప్రస్తుత అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను స్థానికులు విన్నవించడంతో పనులు మరలా ప్రారంభమయ్యాయి. పనులు ఎట్టకేలకు ప్రారంభమవడంతో పంచాయతీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


జామిగుడ గెడ్డపై వంతెన నిర్మాణానికి రాయి బ్లాస్టింగ్ చేసిన దృశ్యం

ఆనందంగా ఉంది



జామిగుడ వంతెన పనులు ప్రారంభం కావడం ఆనందంగా ఉంది. రెండేళ్ల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. స్థల వివాదం కారణంగా జాప్యం జరిగింది. అనంతరం ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. వర్షాలు కురిసినపుడు గెడ్డల ఉధృతి వల్ల చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచేవి. వంతెన లేకపోవడంతో వరద నీరు తగ్గేంత వరకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఉండేవి కావు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వంతెన పనులకు శంకుస్థాపన జరిగింది. ఎన్నికల కోడ్ వల్ల నిలిచిన పనులు రెండు వారాల నుంచి మొదలయ్యాయి. అన్ని మేటీరియల్ డంప్ చేసి పనులు ప్రారంభమయ్యాయి. పంచాయతీవాసులతో పాటు ఒడిశా సరిహద్దు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– టి.అన్నమ్మ, సర్పంచ్ జామిగుడ పంచాయతీ, పెదబయలు మండలం

శరవేగంగా పనులు

వంతెన పనులు రెండు వారాల నుంచి ప్రారంభమయ్యాయి. వేసవిలో బాటమ్, పిల్లర్ల దశ పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు వేగవంతం చేస్తున్నాం. గిన్నెలకోట వంతెన చిన్నపాటి పనులు మాత్రమే ఉన్నాయి. మిగిలిన పనులు పూర్తయ్యాయి. గిన్నెలకోట వంతెన కంటే జామిగుడ వంతెన పెద్దది. దీన్ని వేగంగా పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు జరుగుతున్నాయి. గ్రౌండ్ స్థాయి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నాం.

– పి.రాము, ఏఈటీడబ్ల్యూ ఇంజనీరింగ్ విభాగం,పెదబయలు

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

వి.ఆర్.పురం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఉన్న దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద బుధవారం ఉదయం 10గంటలకు జెండా ఆవిష్కరణ, కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. నాయకులు, ప్రజా ప్రతినిధులు అందరూ హాజరుకావాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరు రూరల్: హుకుంపేట విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతు పనుల నేపథ్యంలో గురువారం మండల వ్యాప్తంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఈఈ అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వంతెన నిర్మించాలని డిమాండ్



కుంబిడిసింగి గ్రామంలో ప్రజా చైతన్యయాత్ర నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పనర్స

జి.మాడుగుల: మండలంలో కుంబిడిసింగి పంచాయతీలో పలు గ్రామాల్లో మంగళవారం సీపీఎం ప్రజా చైతన్య యాత్రను నిర్వహించింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనర్స తదితరులు గద్దరాయి, కుంబిడిసింగి గ్రామాల్లోని గెడ్డలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరదల సమయాల్లో రాళ్లగెడ్డ వాగును అత్యవసర పరిస్థితుల్లో దాటుతుండగా ఇప్పటి వరకు ముగ్గురు మహిళలు గల్లంతయ్యారన్నారు.
కూటమి పాలకుల నిర్లక్ష్యం వలన ఇంకా ఎంతమంది ప్రాణాలు బలికావాలని ఆయన ప్రశ్నించారు. వర్షాకాలంలో ప్రయాణం అత్యంత దయనీయంగా మారుతుందని, అంబులెన్సులు కూడా గ్రామాలకు రావటం లేదన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి కుంబిడిసింగిలో రాళ్లగెడ్డపై వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. నాయకుడు ధీనబంధు తదితరులు పాల్గొన్నారు.

30న శివలింగ ప్రతిష్ట మహోత్సవం


గాంధీనగరంలో వేడుక ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సాయిరాం స్వామిజీ

జి.మాడుగుల: మండలంలోని గాంధీగనరం గ్రామ సమీపమున పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో ఉన్న శివాలయాన్ని ఈ నెల 30న ఉగాది పర్వదినాన్న ప్రారంభిస్తున్నట్టు విశాఖ పట్నం భీమిలి సద్గురు సేవాశ్రమం నిర్వాహకులు, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్త సాయిరాం స్వామిజీ తెలిపారు. స్థానిక పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం శివలింగం ప్రతిష్ట మహోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైందవ ధర్మ పరిరక్షణలో భాగంగా అల్లూరి జిల్లాతో పాటు ఒడిశా సరిహద్దు గ్రామాల్లో దేవతా విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. శివలింగం ప్రతిష్ట రోజున అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. సమరసత సేవా ఫౌండేషన్ సభ్యుడు మత్స్యరాజు, అయ్యప్ప సేవా ట్రస్ట్ సభ్యుడు శ్రీనివాసరావు, లక్ష్మీ నాయుడు, కొండలరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలని డిమాండ్


కూటూరు సంతలో ప్రచారం చేస్తున్న నాయకులు

కూనవరం: పోలవరం ముంపు కింద గుర్తించిన ప్రయార్టీ గ్రామాలకు పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, జిల్లా కమిటీ సభ్యుడు పాయం సీతారామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలం పరిధిలోని బొజ్రాయి గూడెం నుంచి మంగళవారం ప్రారంభించిన ప్రజా చైతన్య యాత్ర సాయంత్రానికి కూటూరు గ్రామం చేరుకుంది. పొగాకు చేనులో పనిచేస్తున్న కూలీలను, రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటూరు సంతలో గిరిజన సమస్యల పరిష్కారం కొరకు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్వాసితులకు ఇళ్ల నిర్మాణాలు, ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ విషయంలో సర్వేల పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, జీవో నెంబరు-3 పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. భీమవరం నుంచి బురదగూడెం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు వెంబడి విద్యుత్ లైను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కూటూరు, లింగాపరం సర్పంచ్‌లు బొగ్గా వెంకమ్మ, శంకర్, ఎంపీటీసీ సభ్యురాలు జయసుధ, తమ్మయ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు


విద్యార్థులు గైడ్‌లు అందిస్తున్న ఎంఈవో రాజులు

ఎటపాక: మండలంలోని గౌరీదేవిపేట హైస్కూల్‌ను ఎంఈవో సరియం రాజులు మంగళవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలని, ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఆరోరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ (పాల్వంచ) చైర్మన్ తాళ్లూరి హరిబాబు సమకూర్చిన గైడ్‌లను ఆయన పదో తరగతి విద్యార్థులు అందజేశారు. అన్నిదానాల్లో కన్నా విద్యాదానం గొప్పదని పేద విద్యార్థుల చదవుకు ఇటువంటి సాయం అందించటం అభినందనీయమన్నారు. దాత సేవలన కొనియడారు. విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని అధిగమిస్తూ, భయం వీడి ప్రశాంతంగా రాయాలని సూచించారు. ఉపాధ్యాయులు శ్రీశైలం, లక్ష్మి, స్వరాజ్యలక్ష్మి, వినోద్‌కుమార్, శ్రీను, రవి, వార్డెన్ పవన్‌కుమార్, హోలీ స్పిరిట్ యూత్ కార్యదర్శి రవి, రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అనర్థాలపై అవగాహన


సంగడలో గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న మండల ఏవో శ్రీనివాసబాబు

ముంచంగిపుట్టు: కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో మండలంలోని వనుగుమ్మ పంచాయతీల్లో దాబుగూడ, సంగడ, పనస గ్రామాల్లో మండల వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసబాబు మంగళవారం పర్యటించారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలు, సంప్రదాయ పంటలు వల్ల మేలు గురించి గిరిజనులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని, దానికి దూరంగా ఉండాలని, ఆరోగ్యం, ఆదాయం సమకూరే సంప్రదాయ, వాణిజ్య, కూరగాయాల పంటలు పండించాలని సూచించారు. వ్యవసాయశాఖ ద్వారా అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా గంజాయి సాగు వద్దు.. సంప్రదాయ పంటలు మేలు అని గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ ఉద్యాన సహాయకుడు సునీల్‌కుమార్, వార్డు మెంబర్ బుద్దు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను అరికట్టాలి


డీపీవో లోవరాజుకు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

పాడేరు రూరల్: గిరిజనేతరులు భూ ఆక్రమణలు, అక్రమ కట్టడాలను అరికట్టాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంతల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి లోవరాజు, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనేతరుల అక్రమ కట్టడాలను నిలువరించాలని కోరారు. నకిలీ గిరిజనులుగా చలామణీ అవుతున్న వారికి రెవెన్యూ నుంచి జారీ చేసిన ధ్రువపత్రాలను రద్దు చేయాలని, 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలన్నారు. గిరిజనేతరులకు విద్యుత్‌మీటర్ల అనుమతులను రద్దు చేయాలని వినతిలో కోరారు. కమిటీ సభ్యులు రాజారావు, చిన్నారి, రాణి, రమాదేవి, బొంజిబాబు, బాలరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అష్టలక్ష్మి యాగం ప్రారంభం

ఎటపాక: మండలంలోని ఉప్పగుండాల గ్రామ సమీపంలో మిథిలానగరం, అష్టలక్ష్మి ఆశ్రమంలో యాగశాలలో ఈనెల 23న చేపట్టనున్న అష్టలక్ష్మి యాగం బుధవారం నుంచి ప్రారంభమవుతుంది. ఈ మేరకు పనులు చేపట్టారు. పీతాంబరం రఘునాథచార్యులు స్వామిజీ పర్యవేక్షణలో జరుపనున్నారు. ఈ వేడుకల్లో భాగంగా రోజు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ఆరాధన, అభిషేకం, అర్చనలు, మాలభోగ నివేదన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, హోమాలు, భజనలు, కీర్తనలు, కోలాటాలు, పారాయణాలు, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు జరుగుతాయని అష్టలక్ష్మి యాగం వైభవ కమిటీ తెలిపింది. 12వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు అష్టలక్ష్మి అమ్మవార్ల శోభాయాత్ర భద్రాచలంలోని శాంతినగర్ నుంచి ప్రారంభమై జీయర్ మఠం వరకు అక్కడ నుంచి అష్టలక్ష్మి పీఠానికి పెరుమాళ్ చేరుకుంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

సీహెచ్‌సీని సందర్శించిన డీసీహెచ్‌ఎస్

సాక్షి ఎఫెక్ట్..


అడ్డతీగల సీహెచ్‌సీలో గర్భిణులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ లక్ష్మి

అడ్డతీగల: అడ్డతీగల సీహెచ్‌సీని డీసీహెచ్‌ఎస్ లక్ష్మి మంగళవారం సందర్శించారు. అడ్డతీగల సీహెచ్‌సీలో సేవలు.. సిబ్బంది కొరతపై 'సాక్షి'లో 'పేరు ఘనం-సేవలు పూజ్యం' అనే శీర్షికతో మంగవారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు డీసీహెచ్‌సీ లక్ష్మి సీహెచ్‌సీలోని ఓపీని పరిశీలించారు. ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలపై ఆరా తీశారు. మందుల స్టాకు, రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలోని వార్డులు, ఇతరత్రా ప్రాంతాలను స్వయంగా చూసిన అనంతరం శానిటేషన్ క్లీనింగ్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో చెత్త చెదారం లేకుండా శుభ్రపర్చాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ సతీష్, వైద్యురాలు ప్రసన్నలకు పలు సూచనలు చేశారు.అవసరాలకు తగినట్లు వైద్య సిబ్బంది నియామకాలపై నివేదిస్తామని ఆమె చెప్పారు.

పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి


పాత బస్‌స్టాండ్ సెంటర్‌లో తడి,పొడి చెత్తను సేకరిస్తున్న సిబ్బంది

కూనవరం: మండల కేంద్రంలో స్పెషల్ శానిటేషన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంట్లోని తడి, పొడి చెత్తను వేరుచేసి ఇంటి వద్దకు వచ్చే క్లాప్ మిత్రలకు ఇవ్వాలని సూచించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి క్లాప్ మిత్రలతో కలిసి తడి,పొడి చెత్తలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో రామాంజనేయ ప్రసాద్ ఆదేశాల మేరకు ఇంట్లో ఉన్న చెత్తను తడి, పొడి చెత్తను క్లాప్ సిబ్బంది సేకరిస్తుందని, చెత్తను బయట పారేయవద్దని సూచించారు. పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ


విద్యార్థులకు స్టేషనరీ అందజేస్తున్న ఎంపీపీ శ్రీదేవి

రంపచోడవరం: మండలంలోని పలు పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఎంపీపీ బందం శ్రీదేవి తన సొంత నిధులతో సమకూర్చిన స్టేషనరీని అందజేశారు. ఇందులో భాగంగా ముసురుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, ఏపీఆర్‌ఎస్ బాలికల పాఠశాల, పెదగెద్దాడ జెడ్పీ పాఠశాల, ఇర్లపల్లి కెజీబీవీ పాఠశాల, రంపచోడవరం బాలుర గురుకుల పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు ఇతరత్రా సామగ్రి అందజేసి పరీక్షలపై పలు సూచనలిచ్చారు. పరీక్షలపై ఆందోళన వద్దని, మానసిక ప్రశాంతతో పరీక్షలు రాయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించేదని, పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎంపీడీవో సుండం శ్రీనివాసుదొర మాట్లాడుతూ పరీక్షల్లో 500 పైబడి మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి రూ. 1116 పారితోషకంగా అందజేస్తానని ప్రకటించారు. ఎంపీటీసీ సభ్యుడు కుంజం వంశీ, సీడీపీవో సంధ్యారాణి, ఎంఈఓ రామకృష్ణ, బొబ్బాశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా భూముల రీసర్వే


కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న తహసీల్దార్ రామకృష్ణ, ఇతర అధికారులు

గూడెంకొత్తవీధి: ప్రభుత్వం తలపెట్టిన భూములకు సంబంధించిన రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించినట్టు తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. కలెక్టర్, రెవెన్యూ అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు విషయాలపై ఆదేశాలను జారీచేశారన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాలపై సమగ్ర విచారణ, రైతు రిజిస్ట్రీ వంటి కార్యక్రమాలపై కలెక్టర్ పలు సూచనలిచ్చినట్టు పేర్కొన్నారు. డీటీలు, సత్యనారాయణ, సీతారాం ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తోట పండగ


పూజలు చేస్తున్న గిరిజనులు

రంపచోడవరం: మారేడుమిల్లి మండలం దెందులూరు సమీప కోతులకట్టవ గ్రామంలో మంగళవారం వనదేవతలకు తోట పండుగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదివాసీ జాగృతి అధ్యక్షుడు కారం సీతారామన్నదొర పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని, తరతరాల వారసత్వానికి ఈ పండుగలే నిదర్శమన్నారు. మొదటి పంటలను వనదేవతలకు సమర్పించి ప్రకృతితో మమేకమైన ఆదివాసీలు అడవీ తల్లికి పూజలు చేశారు. నిర్వాహకులు అన్నవరం, వెంకటరెడ్డి, కుమార్‌రెడ్డి, సుభాష్ చంద్రబోస్, గణేష్‌రెడ్డి తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.